# ఆత్మీయ పద్ధతిలో అవిశ్వాసులను ఎదుర్కొను రీతులు

# Encounters of Spiritual Kind

రెవ. డేవిడ్ కీని


**Rev. David Koenig**

Translated by

CLCI BIBLE INSTITUTE NIDUBROLU

# Encounters of a Spiritual Kind

# ఆత్మీయ పద్ధతిలో అవిశ్వాసులను ఎదుర్కొను రీతులు



### అవిశ్వాసులే మన గురి

అవిశ్వాసులైనవారిని మనం కాకుండా వేరొకరు గమనించి సంఘమునకు తెలుపుటకు వారు ప్రత్యేకమైన జీవులుకారు. రోజు మన అనుదిన జీవితములో మనం కలుసుకొనే మామూలు మనుష్యులే అవిశ్వాసులు. సూపర్ మార్కెట్, గుమస్తా, బ్యుటీషియన్, బ్యాంకు ఉద్యోగి, ఉపాధ్యాయుడు, మన ప్రక్క ఇంటివారు, లేదా మన స్నేహితుడు వీరందరు కూడా మన సంఘ సువార్త ద్వారా కలుసుకోవలసిన అవిశ్వాసులే.

ఎవరికైతే ఏసుక్రీస్తు రక్షకునిగా అవసరమో వారే మన గురియై ఉన్నారు. మన సాక్ష్యపు పరిధిలో క్రీస్తును ఎరుగని ప్రతిఒక్కరిని మన గురిగా ఎంచుకొనవలసి యున్నది. ఇంకొక రకమేమంటే క్రొత్తగా మన సంఘపరిధిలోనికి వచ్చిన క్రైస్తవుడు. క్రీస్తును గురించి తెలియనివారు నీకు తెలుసునా? వారికి ప్రభువును వెంటనే తెలుపండి. క్రీస్తుకొరకు మరియు సంఘము కొరకు వారిని చేరే ప్రయత్నంచేయండి.

### ఉపోద్ఘాతము(Introduction):-

పరిశుద్ధ లేఖనములలో ఉన్న ఈ క్రింది ఉదాహరణల ద్వారా మన ప్రభువైన క్రీస్తును గురించి ఇతరులకు చక్కని సాక్ష్యము ఇచ్చు పద్ధతులను మనము నేర్చుకొనే ప్రయత్నము చేస్తున్నాము. సువార్తలను మరియు అపొస్తలుల కార్యముల గ్రంథమును ధ్యానించుట ద్వారా అనుకోనిరీతిగా ఈ ఉదాహరణలు తీయబడినవి. ఇది ఎటువంటి ప్రత్యేక ప్రయత్నం ద్వారా తీయబడినది మాత్రం కాదు. బాస్కెట్ బాల్ పద్ధతిమాదిరిగా ఒకరినుండి మరియొకరికి వ్యక్తిగతంగా అందించబడిన సాక్ష్యము యొక్క ఉదాహరణలు మాత్రమే. ఈ ఉదాహరణలలోనిది ఇదివరకే ఎవరైనా వివరించినా దానిని గురించి మేము ఆలోచించడంలేదు. ఈ ఉదాహరణలలోనిది లోగడ ఎవరైనా చిన్న చిన్న విశ్వాసుల గుంపులకు ఈ సాక్ష్యపు పద్ధతిని వివరించిన దానిని గురించి కూడా మేము ఆలోచించడంలేదు. అయితే ఒకరినుండి మరియొకరికి ఈ సాక్ష్యపు ఉదాహరణలు అవిశ్వాసులైన వారికి అందించబడాలనేదే మా యొక్క ఉద్దేశ్యము.

ఇది సాక్ష్యంగా అందుకొన్న ప్రతిఒక్కరు విశ్వాసులుగా మారతారని మేము భావించడంలేదుగాని, ఈ సాక్ష్యం ప్రతిఒక్కరికి అందించబడినదా లేదా అనేదే మా ఆలోచన. మనము దేవుని యొక్క శక్తి కనికరమును ఎరిగియున్నాము. యెషయ 55 ప్రకారము దేవుని వాక్యము ప్రభువు ఆశించినట్లుగా ఏమేమి నెరవేర్చగలదో మనకు తెలియును. ఇది సాక్ష్యంగా అందుకొన్న కొద్దిమందిగాని లేదా అనేకమందిగాని దీనిని విశ్వసించకపోయినా మనము కలత చెందకూడదు.

ఎందుకంటే మనిషికి మూర్ఖమైన తిరుగుబాటు స్వభావముగల హృదయము ఉంటుందని మనకు తెలుసు.

మన శక్తియుక్తుల ద్వారా పరిశుద్ధాత్ముడు ధర్మశాస్త్రము ద్వారా మరియు సువార్తల ద్వారా అవిశ్వాసులలో పనిచేయగలడు. కాని విచారకరమైన విషయమేమంటే మన శక్తియుక్తులను మనము సరిగా ఉపయోగించకపోవడమే. మన నిర్లక్ష్యము, అనవసర భయాలు, మనలోని పరస్పర తేడాలు మరియు సందేహాలు మన పరిచర్యను అప్పుడప్పుడు ఆటంకపరచుచున్నవి. ఈ విధంగా మనము ప్రభువుకు ఉపయోగపడలేని అల్పవిశ్వాసము గలిగినవారిగా మిగిలిపోతున్నాము. అయితే ఈ క్రింది చక్కని ఉదాహరణలద్వారా ఇతరులకు ఆసక్తిగాను అర్ధమగురీతిలో సువార్త సాక్ష్యము చెప్పుటకు శక్తిమంతులమగునట్లు మనలను మనము కట్టుకొన ప్రయత్నము చేయగలము. బాప్తీస్మమిచ్చు యోహాను మాదిరిగా మనము కూడా క్రీస్తును అందరికి చూపుచూ "ఇదిగో లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొర్రె పిల్ల" అని సాక్ష్యము చెప్పుటయే మన ఆఖరి గురిగా ఉండవలెను. అంతేకాకుండా మనము ఈ విషయములో మన నైపుణ్యాన్ని హృదయపూర్వకముగా ప్రదర్శిస్తు ఏమాత్రము అతిశయము లేకుండా యోహాను భక్తుని మాదిరిగా "ఆయన హెచ్చవలసియున్నది నేను తగ్గవలసియున్నది" అనే విషయాన్ని మనము మరచిపోకుండా గమనించవలసియున్నది. మనకు ఎటువంటి ప్రత్యేకమైన వరములున్నను, వాటిని ఎంత అద్భుతముగా మనము వియోగించినను, వాటిద్వారా మనలను మనము మహిమ పరచుకొనుటకాదుగాని వాటిద్వారా ప్రభువు మహిమ పరచబడవలసియున్నది అనే విషయాన్ని మనము ఎన్నడూ మరువరాదు. కనుక క్రీస్తును ఎరుగని వారిని మనతో కలుపుకొనుట ద్వారా దేవునికి మహిమ కలుగునట్లు మనము ఎల్లప్పుడు చూడవలెను.




Hungering and Thirsting after Righteousness

***నీతిమంతులుగా తీర్చబడిన తదుపరి ఆకలితోను దప్పికతోను ఉండుట***:- లూకా19:1-10

నీతిమంతులుగా తీర్చబడిన తదుపరి వాక్యముకొరకు ఎంతో ఆకలితో ఉన్నవారిని కలుసుకొనుటకు మనము ఎంతో కరుణతో ప్రయత్నిస్తాము. ఎందుకనగా వారికి వాక్యము గురించి సరైన అవగాహన లేక నూతన జీవితంలో ఎదురగు అనేక ప్రశ్నలకు జవాబులు వెదకుచు, వాటికొరకు తప్పుడు స్థలాలకు వెళ్ళినా వారికి సరైన సమాధానాలు దొరకక అక్కడనే మరల మరల జవాబుల కొరకు వెదకుచూఉంటారు.

ఈ విధంగా వారికి వారే ఆ చిక్కు ప్రశ్నలకు జవాబులకొరకు శ్రమించి చివరకు ప్రయత్నించలేని స్థితికి తీసుకొనిరాబడుదురు. అయితే జవాబు దొరకని ఆ ప్రశ్నలను గురించి వారి మనస్సాక్షి వారితో ఎప్పుడు మాట్లాడుతూనే ఉంటుంది. కనుక వారు తప్పుచేసినవారి మాదిరిగా మనస్సంతా ఖాళీగా నెమ్మదిలేని స్థితిలో ఉంటారు.

జక్కయ్యకు ప్రజలు తనను గురించి ఎంత చెడ్డగా తన ముఖానే గాకుండా తన వెనుకకూడా  చెప్పుకుంటున్నారో ఖచ్చితంగా తెలుసు. ఈ పరిస్థితి చాలాకాలంగా జరుగుచూ ఉన్నది కనుకనే జక్కయ్య మనస్సు నలిగిన స్థితిలో ఉన్నాడు. సుంకపు గుత్తదారుడుగా ధనము శక్తిఉన్నవాడైనా తన సమస్యకు జవాబు కనుగొనలేని స్థితిలో ఉన్నాడు. సహజంగానే అతని స్వంత ప్రజలే అతని గుణము, అతని ఉద్యోగము గురించి చెడుగా మాట్లాడి అతనిని బహిరంగ పాపులతో కలిపివేసినారు. ప్రజలేరీతిగా భావించినారో సందేహంలేకుండా రోమా ఉన్నతాధికారులు కూడా జక్కయ్య గురించి అదేరీతిగా భావించి ఉండాలి. ఎందుకంటే యూదులు ఎటువంటివారో వారికి బాగుగా తెలుసు. జక్కయకు కూడా తాను ఎంత మోసపూరితంగా తన ఉద్యోగం చేస్తున్నాడో, ఎంతమందిని తన పన్ను వసూళ్ళతో దు:ఖపరచినాడో చాలా బాగుగా తెలుసు. ఇదే విషయాన్ని తరువాత ప్రభువు సన్నిధిలో జక్కయ్య ఒప్పుకొనినాడు కూడా.

ఇటువంటి ఘోరస్థితిలో ఉన్న ఈ మనుష్యుని కలుసుకొనుటకు ప్రభువు వస్తూ ఉన్నాడు. అయితే ఈ సంఘటన కాకతాళీయముగా ప్రభువుయొక్క పర్యటనలో జరిగినదని మనము భావించరాదు. లోతుగాచూస్తే తన ప్రేమను జక్కయ్య తెలుసుకొవాలని ప్రభువు భావించినాడు. ఎందుకనగా జక్కయ్యకు అంతాఉన్నాకాని తన చుట్టుప్రక్కల అందరియొక్క ప్రేమను కోల్పోయి ప్రేమలేని స్థితిలో ఉన్నాడు. అందువలన ప్రభువు ఉద్దేశ్యపూర్వకముగా తన ప్రేమను జక్కయ్యకు పంచుటకు కలుసుకొనెను. ప్రభువు మనలను కూడా ఉద్దేశ్యపూర్వకంగానే సువార్తకొరకు పంపుచున్నాడని మనము జ్ఞాపకముంచుకొనవలెను. ప్రభువు ప్రేమను ఏఏ సంధర్భాలలో ఎక్కడెక్కడ పంచవలసియున్నదో అక్కడనే ప్రభువు మనలను ఉంచుతాడు. అందుకనే ఆయన ఈ అవకాశాలను మన జీవిత మార్గాల్లో ఉద్ధేశ్యపూర్వకముగా ఉంచినాడు. ఇక్కడ ప్రభువు ఉద్ధేశ్యపూర్వకముగా లోతుగా చూచి మాట్లాడుచున్నాడు. అందుకే జక్కయ్యను అందుకోగలిగినాడు.

ప్రభువు తన ధ్యానాన్ని జక్కయ్యమీద కేంద్రీకరించినాడు. అందరిచేత సర్వసాధారణముగా అలక్ష్యంచేయబడిన వానిమీద కరుణగలిగిన ధ్యానం కేంద్రీకరించబడినది. ప్రతి ఆత్మకూడా ప్రభువుకు ఎంతో విలువైనది. మన ప్రభువు ఈ లోకమునకు వచ్చినది పాపులను రక్షించుటకే. అందుకే పాపులలో ఒకడైన జక్కయ్య ఇక్కడ రక్షించబడుచున్నాడు. దేవుని ప్రేమ మానవుల ఊహలకు అందనిది, మించినది. మన యెడల దయచూపించువారిమీద మనము దయకలిగి ఉండమా? మనకు పరిచర్య

చేయువారికి మనము పరిచర్యచేయమా? కాని ఇక్కడ లోక విరుద్ధముగా తనకు పరిచర్య చేయని మన చెడ్డ శత్రువుగురించికూడా ప్రార్థించడమే ప్రభువు ప్రేమకు నిదర్శనం. చెడుకు బదులుగా మంచిని ఇవ్వగలుగుటయే దేవుని గొప్పప్రేమయొక్క అర్థం. ప్రేమించబడనివారిపై, అలక్ష్యము చేయబడినవారిపై లక్ష్యముంచుటయే ప్రభుని ప్రేమకు అర్థం. చుక్కాని మరియు తెడ్లులేని పడవలలో తేలుతూ పాపపు చీకటికమ్మిన జీవిత సముద్రంలో ఎందరో దారి తప్పిపోతున్నారు. అటువంటివారి దగ్గరకే మనము సువార్త అనబడిన చుక్కానిని మరియు తెడ్లను తీసుకొని వెళ్ళవలసియున్నది.

త్రోవలోనున్న జక్కయ్యపై లక్ష్యముంచుటయే కాకుండా, ఇతరులకు ఇష్టము లేకపోయినప్పటికి అతని ఇంటికి వెళ్ళుటకు ప్రభువు సిద్ధపడినాడు. ఈ వేషధారణ ప్రపంచమును ఆకళింపు చేసుకొనుటకంటే, సువార్తను ఇతరులకు అందించడమనేది ఎంతో ఉన్నతమైనది. అటువంటి సువార్త అందని స్థలాలో వాక్యమును అందించుటకు మనలను మనమే సిద్ధపరచుకొనవలసియున్నది.

ఇంతవరకు ఎన్నడను ఇతరుల ప్రేమను రుచిచూడని జక్కయ్య, ప్రభువు ఉన్నత ప్రేమను రుచిచూచిన తరువాత జక్కయ్యయొక్క ప్రతిక్రియ ఏమనగా " అతడు త్వరగా చెట్టుదిగి సంతోషముతో అయనను తన ఇంటచేర్చుకొనెను." ఆ పాపిచూపిన ఆ ప్రత్యక్షప్రేమకు ప్రతిఫలముగా "నేడు ఈ ఇంటికి రక్షణ వచ్చియున్నది" అని ప్రభువు సెలవిచ్చినాడు. ప్రభువును విశ్వసించినానని, తాను పశ్చాత్తపపడినానని జక్కయ్య ఈ క్రిందివిధముగా తెలియపరచినాడు. "ఇదగో ప్రభువా! నాఆస్తిలో సగము బీదలకిచ్చుచున్నాను. నేనెవని యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనినయెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతను" అని చెప్పెను. ధర్మశాస్త్ర కట్టడ ప్రకారము చెల్లింపవలసినదానికంటే మరి ఎక్కువగా జక్కయ్య తిరిగి చెల్లిస్తూఉన్నాడు. ఇదే జీవముగలిగిన క్రీస్తు సువార్తలో ఉన్న గొప్పశక్తి.

ప్రభువు అతనియెదుట నిలబడుటయేకాకుండా అతని హృదయములో కూడా జీవించినాడు. ప్రచురింపబడిన ఈ ఉదంతంలో పాపిని ఎదుర్కొనుటను గురించి ఎక్కువగా చెప్పబడకపోయినా, సాక్ష్యముచెప్పుటకు కావలసిన దేవుని ప్రేమయొక్క ఉద్దేశ్యమును స్పష్టంగా మనము చూడగలము. బయటకు చక్కగా కనపడేవారికొరకు మాత్రమే ప్రభువుయొక్క సంఘము కాదని అది అందరికొరకని మనము చూడగలము. ఎన్నడూ కలలోకూడా చూచిఉండని, ఎప్పుడుకూడా కలుసుకొనని అపరిచిత వ్యక్తిని మనము ఎన్నిసార్లు మన ప్రక్కన ఆరాధనలో కూర్చొనియుండుట చూచినాము! కాని మనము పట్టించుకొనము. కాని తప్పిపోయినవారిని వెదకి రక్షించుటకు ప్రభువు ఈలోకములోనికి వచ్చెను. ఈలోకములో అలక్ష్యముచేయబడినవారిని ఎన్నడయినా మనము కలుసుకొనినప్పుడు మన మాటలు వారు వినులాగున, వారి హృదయములలో మన మాటలు వారికి మంచి నిరీక్షణ కలిగించులాగున మన సంపూర్ణ ధ్యానం వారి

మీద కేంద్రీకరింపడులాగున మనము ప్రార్థన చేయవలసియున్నది. ఈ ఉదాహరణలో ఇతరుల యెడల మనము ఎటువంటి ప్రేమను చూపుట మొదలుపెట్టవలెనో స్పష్టముగా చూచియున్నాము.


Respect for Religion But with Doubts

***మతమంటే గౌరవమేకాని అనేక సందేహాలు:-*** లూకా 7:36-50

ప్రభువంటే విశ్వాసంలేకుండా మతమంటేనే గౌరవంకలిగిన వారిని అనేకులను మన దైనందిన జీవితంలో చూస్తుంటాము. పై వాక్యభాగములో ఉన్న పరిసయ్యుడు ప్రభువునకు గౌరవం చూపినాడు మరియు ప్రభువును తన ఇంటికి ఆహ్వానించి భోజనం సిద్ధపరచినాడు. అక్కడితోనే అది ముగిసిపోయినది. అక్కడ పరిసయ్యుడి యొక్క విశ్వాసం రక్షించబడునటువంటిదిగా లేదు. సీమోను అను ఈ పరిసయ్యుడు, యేసు ప్రవక్తయైన ఎడల... అని ప్రభువును గూర్చి సందేహించినాడు. ప్రభువు సీమోను మనస్సు గ్రహించి, ఇద్దరు ఋణస్థులు, ఒక అప్పిచ్చువానిని గురించి చెప్పి, సీమోనును మరియు పాపాత్మురాలైన స్త్రీని వారికి పోల్చుతూ చక్కని ఉపమానము చెప్పెను. సీమోను స్వభావసిద్ధముగా స్వనీతిపరుడైనటువంటి వాడు. ఇటువంటి లక్షణము 'నీకంటే నేను చాలా పవిత్రుడను' అనే భావనకు దారితీయగలదు. "ఈ స్త్రీ ఎవతియో ఎటువంటి పాపాత్మురాలైన స్త్రీయో" అని తనలో తాను అనుకొనుటద్వారా తన స్వభావాన్ని కనపరచినాడు.

సీమోను మనస్సులో అనుకొనిన దానిని ప్రభువు గ్రహించి కూడా దాని గురించి బాధ పడలేదు. సీమోను ఎంత స్వనీతిపరుడైనాగాని ప్రభువు చెప్పినదానిని వింటున్నాడు. ప్రభువు సీమోనును ముఖాముఖిగా ఎదుర్కొనకుండా, మనస్సులోనిది పారదర్శకంగా తెలిసే పద్ధతిలో ఎదుర్కొంటున్నాడు. సీమోను మనస్సులోని ఆలోచనను ఎత్తిచూపి దానికి పశ్చాతపడమని ప్రభువు కోరలేదు. దానికి బదులుగా ప్రభువు సీమోనుకు ఒక ప్రశ్నవేసే విధముగా ఒక చక్కని కథను చెప్పినాడు. ప్రశ్న ఏమిటంటే ఐదువందల దేనారములు ఋణము తీసుకొనినవానిని మరియు ఏబది దేనారములు ఋణము తీసుకొనినవానిని అనగా ఇరువురిని అప్పిచ్చినవాడు క్షమించినచో వారిరువురిలో ఎవరు ఎక్కువగా అప్పిచ్చినవానిని ప్రేమించగలరు. దీనికి ఐదువందల దేనారములు తీసుకొనినవాడే ఎక్కువగా ప్రేమించుననే సమాధానమునకు సీమోను కట్టుబడినాడు. ఇది మనకు దావీదు పాపమును ఎత్తి చూపిన నాతాను కథను గుర్తుకు తెస్తూఉన్నది. అయితే అక్కడ దావీదు పశ్చాతాపముతో కూడిన బదులిచ్చినాడు. అయితే సీమోను గురించి ఇక్కడ అటువంటిది ఏమి వ్రాయబడలేదు. ప్రభువు సీమోనును గట్టిగా ముఖాముఖి విధానంతో పశ్చాతాపం గురించి సమాధానం అడిగి ఉన్నట్లయిన సీమోను నిరాశపడి మరింత బిరుసుగా ఉండుటకు ఇష్టపడవచ్చు. ఈ సందర్భంలో సీమోను పశ్చాతాపపడకపోయినా పరిశుద్ధాత్ముడు ఒక చక్కని కథ ద్వారా అతనికి సమస్తమును

తేటగా విశదపరచినాడు. దీనిని బట్టి మనము నేర్చుకొనవలసినదేమంటే ఒక అవిశ్వాసి మన సాక్ష్యాన్ని వినుటకు మన యెడల విశ్వాసము చూపిన యెడల మనముకూడా పారదర్శక పద్ధతిని అనుసరించవలెను కాని ముఖాముఖిగా వారి పాపమును ఎత్తిచూపరాదు. మనమాట వినుటకు ఇష్టపడి, మనతో మాట్లాడుటకు ఆత్రుతో ఎదురుచూచువానిని, మన మనస్సులోని అసలు విషయం చెప్పక ముందే వారిని విమర్శించి వారి మనస్సు విరచి వారి ముందర కాళ్ళకు బంధంవేసి వారిని ఆపివేయుట ఎందుకు? తదుపరి ప్రభువు సీమోను చేయనిదానిని మరియు ఆ స్త్రీ కన్నీటితో తన పాదములను తడిపి తన తనవెంట్రుకలతో తుడుచుటను, తన పాదములను ముద్దు పెట్టుకొనుటను మరియు పాదములకు అత్తరు పూయుటను గూర్చి వారిరువురిని పోల్చి తన మనస్సులోని అసలు విషయాన్ని బయటకు తీసుకొనివచ్చినారు. పాపక్షమాపణలోనుండి ఉద్భవించిన నిజమైన ప్రేమ యేమిటో సీమోనుకు ఈ కథద్వారా చక్కగా చెప్పబడినది.




దీనిద్వారా సీమోను తనను గురించి తాను ఆలోచించుకొనడానికి ఒక విషయము మిగిలినట్లుగా మనము కూడా ఇప్పటి వరకు మనము నమ్ముచున్న దానిని కాకుండా దేని గురించి మనము ఆలోచించవలెనో మనకు నేర్పుచూఉన్నది. సీమోను విషయంలో పరిశుద్ధాత్ముడు అతని మీద పాపమును గురించి ఏ నేరము మోపుట అవసరమైయున్నదో అదే అతనికి తెలియపరచబడినది. అదే విధంగా ఆ స్త్రీ గురించి అతని చెవులలో చెప్పబడిన చక్కని సువార్త కూడా సీమోనుకు మిగిలియున్నది. మన యొక్క సువార్త ప్రకటనలో ప్రభువు సన్నిధి మనతో ఉన్నదని గ్రహించి మన సాక్ష్యం చాలా స్పష్టంగా చెప్పవలసియున్నది. ప్రభువు తన కథలో సీమోనుకు అలోచించుకొనుటకు మిగిల్చిన రీతిగా మనముకూడా ఇతరులు కొంత గుర్తుంచుకొవడానికి వీలుగా సువార్తను చెప్పవలసియున్నది. అనుదిన జీవితంలో తేలికగా గుర్తుంచుకొనుటకు వీలుగా ఉపయోగించదగిన ఉదాహరణలు, లేఖనాలలో చాలా కలవు. కనుక మనము సువార్త ప్రకటించునపుడు ఉదాహరణలతో ప్రకటించుట అది చాలా ఉత్తమం. మనం అనుకోని సందర్భాలకు ఈ ఉదాహరణలు ఒకొకసారి తీసుకొని వెళ్ళవచ్చు. కాని చివరకు మన ప్రసంగాలను అవే అద్భుతంగా మార్చగలవు. కనుక ఈరీతిగా మనం ఎంత ఎక్కువగా సువార్త సాక్ష్యం ప్రకటించగలమో మన ప్రసంగాలు అంత చక్కగా వచ్చుటకు అవకాశం

ఉన్నది, అంతేకాకుండా పరిశుద్ధాత్ముడు ఇంకా చక్కని వాక్యభాగాలను మరియు ఉదాహరణలను మన మనస్సులోనికి తీసుకొనిరాగలడు.

Willing Inquirer Attracted by something

**ఏదోఒకదానిద్వారా ఆకర్షింపబడి, నమ్ముచూ వివరములు అడుగుచున్నవాడు:-**

మార్కు 12:28-34.

ఆయనను చిక్కుపరచవలెనని పంపబడిన హెరోదీయులతోను పరిసయ్యులతోను యేసు ఏరీతిగా సరైన సమాధానం చెప్పినాడో వివరించిన తదుపరి మార్కు, సద్దూకయ్యులతో కూడా ప్రభువు ఏరీతిగా సమాధానం చెప్పినాడో వివరించినాడు. యేసు సద్దూకయ్యులకు బాగుగా ఉత్తరమిచ్చుట చూచిన ఒక శాస్త్రి ఆయన సమాధానములకు సంతోషించి ప్రభువు దగ్గరకు వచ్చినాడు. పునరుద్ధానము లేదని చెప్పెడి ఆ సద్దూకయ్యుల బోధకు మరియు వారి స్వభావానికి సందేహంలేకుండా ఆ శాస్త్రి కూడా అంగీకరించిఉండడు. యేసులో వెలిగింపబడిన ఆత్మను ఆ శాస్త్రి చూచినాడు. ఇది కేవలము యేసు యొక్క జ్ఞానముకాదు గాని ఆ సందర్భంలోఉన్న విషయమే. శాస్త్రి తదుపరి యేసుకు ఒక ప్రశ్నను వేయుచున్నాడు.

ప్రభువు ఆ ప్రశ్నకు సమాధానము చెప్పిన తరువాత దానిని పూర్తిగా గ్రహించిన ఆ శాస్త్రి ఆయన చెప్పినదానితో తాను పూర్తిగా ఏకీభవించినాడు. వారిరువురి మధ్య ఒక ఉమ్మడి పునాది నేల ఉండుట మనం చూడగలం. ఇదే విధంగా మన యొక్క సువార్త సాక్ష్యముచెప్పునపుడు మనం కూడా ఒక చక్కని పునాది కలిగిఉండుట ఎంతో ముఖ్యము. కారణం అదే పునాది మీద ఆ అవిశ్వాసికూడా నమ్మకము కలిగి మనము చెప్పునది చక్కగా వినగలుగుటకు మంచి సంబంధం ఏర్పాటు చేసుకొనగలడు. ఈ ఉదాహరణలో ఉన్న శాస్త్రి ధర్మశాస్త్రమును ఎరుగును కాని సువార్త గురించి ఇంకా తెలుసుకొనలేదు.

ఈ ఉదాహరణలో ఆ శాస్త్రి ప్రభువు చెప్పిన చక్కటి జ్ఞానముగలిగిన సమాధానములకు ఆకర్షితుడైనాడు. అదేవిధముగా మనయొక్క వ్యక్తిగత సాక్ష్యములు ఇతరులకు వినిపించినప్పుడు వారుకూడా మనలాంటి నిరీక్షణ కలిగియుండి ఇంకా అనేక తెలియని విషయములను గురించి మనలను అడుగునట్లు మనము ఎప్పుడు ఆశింపవచ్చును. అయితే ఇవే కాకుండా వివరాలు అడుగువానిని ఆకర్షించుటకు ఇంకా అనేక ఇతర విషయాలు కూడా కలవు. ఉదాహరణకు మన యొక్క సత్క్రియలు ఇతరులకు కనబడుచున్నవా? లేక మనము వాటిని అసలు చేస్తున్నామా? దేవుని యొక్క ఉన్నత ప్రమాణలతో ఉన్న వాక్యమును అంగీకరించలేనంతగా మన జీవితంలో మన నీతి స్వభావము కట్టుబాట్లలో ఉన్నదా? ఈ రీతిగా మన జీవితము ఉన్నట్లయిన మనము ఇతరులను ఆకర్షింపగలమా? ఒకటి మాత్రము ఖచ్చితముగా చెప్పగలము. అదేమిటనగా చెడ్డతనము ద్వారా మనము ఇతరులను ఆకర్షింపలేకపోవుటయే కాక వారిని వికర్షణకు గురిచేసిన వారమగుదము. చెడును గురించే ఎవరైనా ఎందుకు అడుగుతారు?

ఇది ఏలా చేయాలో మనకందరకు తెలుసును. ఎవరైనా ఒక అభిప్రాయము గురించి సర్దుబాటు చేసుకొనిన తరువాత దాని గురించి వివరాలు అడగాలని ఎందుకు అనుకుంటారు? కాని ఈ దినాలలో ప్రపంచములో ఎక్కడ చూచినా అధికముగా ఉన్నది ఇదే.

వ్యక్తులను సాక్షులుగా మార్చుటకును, మరియు వారితో సంబంధాలు కలిగి ఉండుటకును మనకు అతిముఖ్యముగా కావలసినది కొన్ని విషయములలో వారితో సాధారణముగా కలసియుండుట మరియు ఉమ్మడి పునాది కలిగియుండుట అనేది ఈ సందర్భముగా గమనించవలసియున్నది కాని అంతకంటే వేరే ప్రశ్నేలేదు. వారితో కొన్ని ఉమ్మడి అభిప్రాయములు కలిగి ఉండుటకు మనము ప్రయత్నము కూడా చేయవలసియున్నది. ఈ సందర్భముగా ఒక విషయము జ్ఞాపకమునకు వచ్చుచున్నది. నేను ఒక ఇంటిని దర్శించి వారికి బోధించుటకు వెళ్ళుచూ వారి గుమ్మాన్ని సమీపిస్తూ ఉండగా వారి ఇంటి ముందు చక్కని గులాబీ తోటను గమనించినాను. అయితే నేను వారికి వాక్యమును బోధించిన తరువాత చెప్పినానో లేక బోధించకముందే చెప్పినానో నాకు గుర్తులేదుగాని నేను వారి గులాబి తోట గురించి చెబుతూ మా తండ్రిగారు ఒకప్పుడు ఇలాంటి చక్కటి గులాబి తోటను మా ఇంటిముందు కూడా పెంచినారని, ఆ తోటమీద అధికారిగా నన్ను నియమించిన సంగతి వారితో ముచ్చటించినాను. అయితే ఈ విషయము వారి మీద పిర్యాదుగా నేను చెప్పలేదుగాని వారికి నాకును గులాబీల మీద ఉన్న చక్కని ఉమ్మడి అభిమానాన్ని చెప్పుటకు ప్రయత్నించినాను. దీని ద్వారా ఆ ఇంటి యజమాని నేను ఎందుకు వారిని దర్శించటకు వచ్చానో ఒకసారి గమనించి నేను బోధించిదానిని ఎంతో అనుకూలతతోను మరియు స్నేహపు వెలుగులో దానిని అందుకోగలడు. నేను మరల ఇంకొకసారి ఆ ఇంటిని దర్శించుటకు వెళ్ళునప్పుడుకూడా అతడు అంతకుముందు నేను బోధించినదానిని మరువకుండా చక్కగా గుర్తుంచుకొనగలడు. ఇది చూడడానికి చాలా చిన్న విషయంలా ఉంది. కాని ఇద్దరు అపరిచితుల మధ్య ఏర్పడే మంచులాగా జారిపోయే స్వభావాన్ని తీసివేసి చక్కని సంబంధాన్ని ఏర్పరచుటకు ఇది ఎంతగానో ఉపయోగపడగలదు. ఇది కూడా జ్ఞాపకముంచుకొనదగిన విషయమే. ఈనాటి స్వార్ధపూరిత మరియు గర్వంతో కూడిన దినాలలో గమనించినట్లయిన, నిజమైన ఆసక్తితో ఇతరులను గురించి స్వచ్ఛముగా వెదకి విచారించే వారు కొద్ది మంది మాత్రమే. ఎప్పుడో ఫలితం వచ్చేలాగున ఆలోచనతో నిదానంగా గాని మరియు తర్వాతగాని సువార్త సాక్ష్యంచెప్పుట కాదుగాని, క్రైస్తవులుగా మనము ఎవరికొరకైతే క్రీస్తు చనిపోయినాడో వారికొరకు నిజమైన ఆసక్తితో సువార్త ప్రకటించవలసియున్నది. ఇది ప్రేమలో భాగంకాదా?

అంతేకాకుండా అవిశ్వాసులను ఎదుర్కొని వారిని క్రీస్తుకు అనుకూలంగాచేసి మన పనిని ముగించినా వారిలో మారుమనస్సు లేకపోయినట్లయితే అది ఉపయోగము

లేనటువంటిది. యేసు ఈ వాక్యభాగములో "నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవు" అని ఆ శాస్త్రితో చెప్పుచున్నాడు. ఆ శాస్త్రి దీనిని చక్కగా అర్ధంచేసుకొనినాడు. ఎక్కడైతే మెప్పు ఇవ్వకతప్పదో అక్కడ మెప్పు ఇవ్వక ఆపుట ఎందుకు? ఈ సంఘటన తరువాత మరల ఆ శాస్త్రి ప్రభువును ఎప్పుడైన ఎదుర్కొనినప్పుడు వారిరువురి మధ్య కొనసాగే చక్కటి సంభాషణను మనం ఊహించుకోగలము. మనం అవిశ్వాసులను ఎదుర్కొనే విధానం ఎప్పుడు కూడా ధనాత్మకంగా ఉండాలని ఆశిస్తాము కాని ఇది అన్ని వేళల కొనసాగదు. ఉదాహరణకు ఒక వ్యక్తి మనం చెప్పినదానికి కఠినత్వమును, తిరస్కారమును మరియు ఎగతాళిని ప్రదర్శిస్తే ఎటువంటి ప్రయోజనకరమైన ముగింపు అక్కడ ఉండదు. మనం చెప్పాల్సినదానిని అతనికి చక్కగా చెప్పకుండా అతను నమ్మినదే మంచిదనే అవకాశం అతనికి ఇచ్చినట్లయితే మనం పొరపాటు చేసినట్లే. కాని ఇక్కడ ఈ శాస్త్రి ప్రభువు చెప్పినదానికి ఎటువంటి వ్యతిరేకమైన భావాన్ని కనపరచలేదు. అవిశ్వాసులను ఎదుర్కొనే విధానంలో ఒకవేళ వారుచెప్పిన దానిలో ఏదైనా నిజమున్నట్లయిన వారికి మంచి కితాబునిచ్చుటలో ఏమి తప్పులేదు. అయితే వాటిలో ఏవైనా ఇచ్చకపుమాటలు ఉన్నట్లయినా వాటినుండి మనలను మనము కాపాడుకొనవలసియున్నది. ప్రభువు ఇక్కడ ఆ శాస్త్రి గురించి ఇచ్చిన యధార్ధ వా:జ్ఞ్మాలము లేదా పొగడ్త చక్కని క్రమములో ఉన్నది.

మన జీవితములలో కూడా ఇటువంటి చక్కని సన్నివేశములను ఎదుర్కొనాలంటే, వారితో మాట్లాడుటకు వారిని వెదకవలసియున్నది మరియు ప్రభువుయొక్క చిత్త ప్రకారము ప్రతిరోజుకూడా మనము జీవించవలసియున్నది. అంతేకాకుండా ఇతరులు కూడా మనతో మాట్లాడి వారు మన సత్క్రియలు చూచి దాని ఫలితంగా మనతో కూడా వారు ప్రభువుయొక్క కృప కనికరముకొరకు ఆయనను మహిమపర్చులాగున మనము ప్రార్ధన చేయవలసియున్నది.


**The Shocked**

***ఆయాసము పొందినవారు***:- తీర్పు ద్వారా ఆయాసము పొందినవారు లేదా తీర్పుకు దగ్గరగుటచేత ఆయాసము పొందినవారు. (యోహాను 8:3-12) ప్రేమ వలన ఆయాసము పొందినవారు. (అపో.కార్యములు 16:23-34.)

ప్రజలద్వారా బహిరంగంగా వ్యభిచారములో పట్టబడిన ఆ స్త్రీ యొక్క భావాలను మనము ఊహించగలము. వ్యభిచారములో పట్టబడినవారికి రాళ్ళురువ్వి చంపుటయే సరియైన శిక్ష. ఆమె తీర్పును అనుభవించవలసిరావడమేకాక ఒక బహిరంగ ప్రదర్శనలో ఆమె పాల్గొనవలసి వచ్చినది. కఠినమైన మనస్సుకలిగి అందరిముందు కుత్సితబుద్ధి ప్రదర్శించనవారు మాత్రమే చేసినపని ఇది. తీర్పు ఆమెమీద పడటానికి సిద్ధంగా ఉంది.

పరిసయ్యుల యొక్క వేషధారణే ఆమెను తనముందుకు ఈడ్చుకొంటూ తీసుకొని వచ్చుటకు వారిని ప్రేరేపించినదని ప్రభువుకు ముందే తెలియును. వారికి ఒక పాఠము

నేర్పవలసియున్నది. ఈ పాఠముతోబాటుగా ఆ స్త్రీకి విడుదలకూడా కావలసియున్నది. పెద్దలమొదలుకొని పిన్నలవరకు ఒకనివెంట ఒకరు వరుసగా బయటకు వెళ్ళిపోవుట ద్వారా ఆ స్త్రీ మీద ఉన్న ఆ చీకటి మబ్బు ఎలా ఎత్తివేయబడినదో నీవు ఊహించగలవా? ఎంతటి ఉపశమనము! కాని తాను చేసిన తప్పుకు ఆ శిక్షను పొందవలసియున్నదని ఆ స్త్రీ ఎరుగును.



కాని ఆమెకు మరియొక అవకాశము ఇవ్వబడినది. "లేదు ప్రభువా" అని ఆమె చెప్పుటలో ఒక మంచి బోధకునికి ఇవ్వవలసిన గౌరవంకంటే ఎక్కువే గౌరవించినట్లుగా "ప్రభువా" అని ఆమె పలికిన మాటద్వారా మనము చూడగలుగుట కష్టమైనదేమికాదు.

ఇక్కడ ప్రభువు సువార్తను మాట్లాడుచూ ఉన్నాడు. "నేనును నీకు శిక్ష విధింపను." విశ్వాసమునకు చూపవలసిన విధేయతను ప్రభువు ఆమెకు గుర్తు చేయుచూ ఉన్నాడు. "నీవు వెళ్ళి ఇక పాపము చేయకుము." మన ప్రభువు హృదయములను చదవగలడని మరియు ఆమెయొక్క పశ్చాతపమును ఆయన ఎరిగియున్నాడని మనకు తెలియునుకదా! ఒకరి హృదయ వ్యక్తిగత భావాలను మనము తెలుసుకొనుట కాదుగాని చెప్పబడిన సువార్త ద్వారా ఖచ్చితముగా మనము వారి మనస్సులోనికి వెళ్ళవలసియున్నది.

ఒక తీర్పుగాని లేదా ఒక విపత్తు, ఉపద్రవం లేదా మరియొకటిగాని ఒక వ్యక్తి జీవితంలో వచ్చినప్పుడు అతడు చేసే పనులకు ఎంతటి ఖాళీ ఏర్పరచగలదో వేరే ఆలోచించే ప్రశ్నేలేదు. కొన్ని సంవత్సరముల క్రిందట అమెరికాదేశములోని సౌత్ డకోటా జిల్లాలో రాపిడ్ సిటి అనే పట్టణంలో ఒక పెద్ద వరద వచ్చింది. అయితే ఆ వరద వచ్చిన తరువాత ఆ పట్టణవ్యాప్తంగా సంఘాలలో హాజరు గణనీయంగా పెరిగినట్లుగా గమనించబడినది. ఆ పట్టణస్తుల పాపపు జీవితానందం ఈ వరద ద్వారా ఆయాసపెట్టబడినది. వరద ద్వారా ఎంతోమంది ప్రజలు చనిపోవుటద్వారా మరియు ఆస్తుల నాశనమగుటద్వారా ప్రజలు తమ జీవితములలో ఒక మార్పును కోరుకొనినందున సంఘములలో హాజరు పెరిగినది.

ఇటువంటి సందర్భాలలో మనము అవిశ్వాసులను ఎదుర్కొనునప్పుడు ఇటువంటి వాటినుండి తప్పించుకొనుట అనునది కేవలం వారి అమాయకత్వంవలనకాని, లేదా వారిమంచితనమువలనగాని, లేదా వారి పుణ్యంవలన అని వారిని అనుకొననీయరాదు. (వారు అవిశ్వాసులని మనము జ్ఞాపకముంచుకొనవలసియున్నది)

ఇక్కడ ఆ స్త్రీ వ్యభిచారములో పట్టబడినది. ఆమె తన తప్పును తాను గ్రహించినది. కనుక ఇక్కడ ఆ వ్యక్తిని తన అనర్హతను గుర్తించేవిధముగా చేయవలెను. అటువంటి వారికొరకుకూడా ప్రభువు చూపుచున్న కనిరమువైపు వారిని మళ్ళించవలసియున్నది. ఆ స్త్రీ తప్పు చేసినా తీర్పునుండి విడుదల పొందుకొనినది. అది ఎటువంటి సందర్భమైనా కాని ప్రభువు అపాత్రుల యెడల చూపు అపారమైన మరియు వెలలేని ప్రేమను ఉపకారమును ప్రకటించుట అనే దాహము మనము కూడా గలిగియుండవలెను. ఇటువంటి పరిస్థితులలో ఉన్న ఈ పాపాత్మురాలైన స్త్రీ విషయంలో ధర్మశాస్త్రం తన ఉద్యోగమును నెరవేర్చినది కనుక, మనము ధర్మశాస్త్రము గురించి తక్కువగా మాట్లాడుటమంచిది. 12 వ వచనములో చెప్పబడిన విషయమును అనగా ''నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగును గలిగి యుండును,'' అని ప్రభువు చెప్పిన ఈ విషయమును మనముకూడా చెప్పవలసియున్నది.

ఈ భాగములో రెండవదిగా, తీర్పు విషయములో ఆయాసపెట్టబడుట కాకుండా ప్రేమ విషయంలో ఆయాసపెట్టబడినవానిని ఇప్పుడు మనము గమనిద్దాం. చెర నుండి తప్పించబడిన ఖైదీల విషయములో తనమీదకు రావసిన తీర్పు నుండి చెఱసాల అధికారి తప్పించబడినాడని అనుకొనవచ్చు. అయితే ఇక్కడ ముఖ్యమైన విషయమేమంటే, మిగిలిన ఖైదీలు కూడా గమనించని రీతిలో పౌలు మరియు సీలలు ఇంకా చెరసాలలోనే యున్నారు. అయితే గాయాల కారణంగా పౌలు శక్తివిహీనమై చెరసాలనుండి తప్పించుకొనలేక పోయాడనేది వాస్తవంకాదు. అదేవిధంగా ఒకవేళ తాను చెరసాలనుండి తప్పించుకొని వెళ్ళినట్లయితే పట్టణ అధికారులచేత తనకుగాని లేదా తన కారణంగా క్రీస్తుకు అవమానముగాని లేదా దూషించబడుటగాని జరుగుతుందని పౌలు భావించలేదు. మరి ఎందుకు పౌలు చెరసాలనుండి వెళ్ళిపోలేదు! కేవలము పౌలు మనస్సులో చెరసాల నాయకుడు మాత్రమే ఉన్నాడు. తప్పించుకొనిన ఖైదీల నిమిత్తము అతడు మరణదండనకు పాత్రుడు కాకూడదని పౌలు ఖచ్చితంగా భావించి తాను తప్పించుకొనలేదు.

తరువాత చెరసాల నాయకుడు మేలుకొని తలుపులన్నియు తెరచియుండుట చూచి ఖైదీలు పారిపోయిరనుకొని, కత్తిదూసి, తన్నుతాను చంపుకొనబోయెను. అప్పుడు పౌలు - నీవు ఏ హానియు చేసికొనవద్దు, మేమందరము ఇక్కడనే యున్నామని బిగ్గరగా చెప్పెను. అ.కా 16:27-28. ఆ చెరసాల నాయకుడు పౌలుకు ఎంతో కీడు అపకారము చేసియున్నాడు. అతడు పౌలును కనీసం ఏమాత్రం కూడా పట్టించుకొనలేదు. అయితే ఇప్పుడు పౌలు అతని గురించి ఎంతో గొప్పగా పట్టించుకొనుచున్నాడు. అపకారికి పౌలు ఇప్పుడు ఉపకారము చేయుచున్నాడు. ''మిమ్మును హింసించువానిని దీవించుడి.....

కీడుకు ప్రతి కీడెవరికిని చేయవద్దు.....నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము, అలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక, మేలుచేత కీడును జయించుము.'' రోమా 12:14-21. ఈ విషయమును మనము ప్రభువు యొక్క కొండమీద ప్రసంగములో గమనించగలము. ఇదేవిధముగా పేతురు కూడా తన పత్రికలో మనకు గుర్తుచేస్తున్నాడు. 1 పేతురు 3:9. ఇదే సాధారణమైన మరియు పరిశుద్ధమైన సువార్త. ఈ చెడ్డ ప్రపంచం అర్థం చేసుకోలేని ప్రేమ ఇది. ఎవరికైతే ఈ ప్రేమ అర్థం అవుతుందో అతడు ఖచ్చితముగా ''భయముతో వణకవలసియున్నది'', ఎందుకనగా చెడ్డతనముతో నిండిన విలువలేని జీవితాలకు ఆ ప్రేమ ఎంతో ఉన్నతమైనది.

''రక్షణపొందుటకు నేనేమి చేయవలెను'' అని ఆ చెరసాల నాయకుడు అడుగుచూ ఉన్నాడు. అప్పుడు పౌలు సువార్త యొక్క ఆజ్ఞను గురించి మాట్లాడినాడు ''ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీఇంటివారును రక్షించబడుదురు.'' ఆ రాత్రే ఆ చెరసాల నాయకుని ఇంటికి వెళ్ళుట ద్వారా మరియు అతని కుటుంబం మొత్తానికి బాప్తీస్మము ఇచ్చుట ద్వారా పౌలు మరియు సీల యొక్క సువార్త ప్రేమ క్రియారూపము దాల్చినది. అవిశ్వాసులను ఎదుర్కొనే ఇటువంటి విధానము కొరకే మనము తపించవలసియున్నది. గమనించండి, ఆ చెరసాల నాయకుని ఆత్మీయ మరణమునుండి నిద్రలేపిన ఆ ఆకస్మిక కార్యమే సువార్త ప్రేమకార్యము. దీనిని తక్కువగా పరిగణించలేము మరియు దీనిని వివరించుటకు మాటలు చాలవు. మన మాటలతో ఒక్కొక్కసారి మన చేతలు చాలా తేలికకగా ఏకీభవించవు.

ఏ ఒక్కరికి అర్హతలేకపోయినా తనను శిక్షించినవారిని మరియు తనతో ఉన్న నేరస్తుని సిలువలోనుండి క్షమించిన రక్షకుడైన యేసు ప్రేమనే మన ఆత్మలు కూడా అన్ని చోట్ల ప్రకటించవలసియున్నది. అటువంటి యేసు క్షమాపణనే మనముకూడా ప్రకటించవలసియున్నది.

**The Disinterested**

**ఇష్టములేని వారికి ప్రకటించుట:-(యోహాను 4:7-39)**

మనము ముఖ్యముగా ధ్యానించే సువార్త సాక్ష్యాలలో సమరయ స్త్రీ వృత్తాంతము ఒకటి. ఎందుకనగా ఆ స్త్రీతో మన ప్రభువు యొక్క సంభాషణ చాలా వివరముగా పరిశుద్ధ గ్రంథములో విపులముగా వ్రాయబడినది. ఏమాత్రము అలస్యములేకుండా వెంటనే ఖచ్చితంగా లభించన ఫలితాలను బట్టి ఈ సువార్తభాగము సహజంగానే అందరికి ఎంతో ఆకర్షణీయమైనటువంటిది. ఇక్కడ సువార్త మరియు ధర్మశాస్త్రము ఒకదానితో ఒకటి కలుప బడియున్నవి. ఇక్కడ ప్రభువు సువార్త వలను విసురుతు తన యొక్క పరలోక రాజ్యములో వారిని చేర్చుటకు అవకాశమును తీసుకొంటూఉన్నాడు. ఈ మొత్తం వృత్తాంతములో ముఖ్యముగా మనము గమనించవలసినది ఆమెకు ఈ సువార్త విషయములో ఏమాత్రము ఇష్టములేదనేది.

యేసును చూచుటకుగాని లేక అతని గురించి ఆరా తీయుటకుగాని ఆమె ఆబావి యొద్దకు రాలేదు. కాని ప్రభువే ఆమె కొరకు బావి దగ్గరకు వచ్చియున్నాడు.



"The Sword of the Spirit ...is the Word of God."

దాహము కొరకు నీరు అడుగుట ద్వారా విషయము మొదలైనది. భౌతికమైన మరియు ఈ లోక సంబంధమైన విషయములతో మొదలుబెట్టి ఆత్మ సంబంధమైన విషయములోనికి ప్రభువు తన సంభాషణను జరుపుతూ ఉన్నాడు. దీని ద్వారా ప్రభువునుండి మనము ఎంతో నేర్చుకొన వలసియున్నది. ఈ విధముగా చేయుటకు మనము ఎన్నిసార్లు ప్రయత్నించినాము? అనగా భౌతిక విషయములనుండి ఆత్మీయవిషయముల లోనికి మన సంభాషణను ఎలా మార్చవలెనో ప్రయత్నించియున్నామా?

మొదటిగా ప్రభువు నీటికొరకు చేసిన విన్నపము ఆమె మనస్సును ఆకట్టుకున్నది. ఆమె కేవలము ఒక పేద స్త్రీ మాత్రమే కాకుండా సమరయ జాతి స్త్రీ అయినాగాని ప్రభువు ఆమెతో మాట్లాడినాడు. ఆమె విసర్జించబడిన జాతికి చెందినదని ప్రభువు పరిగణించలేదు. అందరుకూడా దేవునికి ఎంతో విలువైనవారు. మారుమనస్సుపొందిన ఒక పాపిగురించి పరలోకములో ఎంతో సంతోషము కనపడుచున్నది. ఏ ఒక్కరూ తప్పి పోకుండా ప్రతి ఒక్కరుకూడా రక్షించబడాలని దేవుడు కోరుచున్నాడు. ప్రభువు ఆమెకు చేసిన పరిచర్య ఈ ఉద్దేశ్యమునే బయలుపరచు చున్నది. మన సువార్త పరిచర్యలో మనము ఎట్లు ఉంటున్నాము? "నీవు కూర్చుని ముందు నేను చెప్పేదంతా విను" అని ఆజ్ఞాపించే ధోరణిలో ఉంటున్నామా? అతి జాగ్రత్తగానా లేక శ్రద్ధగా ఉంటున్నామా?

ఇక్కడ యేసు తన సంభాషణను భూసంబంధమైన జలమునుండి జీవజలము వైపునకు మార్చుతూఉన్నాడు. మన అనుదిన వాతావరణములో ఆత్మీయతను చూపు ఇటువంటి ఉదాహరణలు అనేకము కలవు. ఎప్పుడు ప్రభువు ఉపయోగించు ఇటువంటి సహజమైన ఉదాహరణలు పరిశుద్ధగ్రంథములో మన అందరకు బాగా తెలిసినవి అనేకము వ్రాయబడియున్నవి. పొలములోని గడ్డిపూవులు - గాలిలోని పక్షులు మొదలగునవి, దేవడు మానవుని ఆదరిస్తున్న విధానానికి ఉదాహరణలు. ఈ లోక కాపరియొక్క ప్రేమగలిగిన పరిచర్యే పరలోక కాపరి యొక్క అత్యున్నతమైన అంతులేని కాపుదల. రొట్టె, తలుపు, చేపలు పట్టుట, మొదలైన అనేక ఈలోక విషయములు ప్రభువు ద్వారా వాడబడినవి. అయితే మనము ఈ లోక విషయములను వినియోగించి పరలోక విషయములుగా వాటిని మార్చుటకు ఎందుకు కష్టపడుచున్నాము. కారణమేమనగా మన యొక్క తలంపులు లోతుగా ఆత్మీయ విషయములపైన కేంద్రీకరించకపోవుటవలనే. ఫలితంగా మనము సరైన సందర్భాలను మరియు సంఘటనలను చూడలేకపోవుచున్నాము.

ఆ సమరయ స్త్రీని ప్రభువు ఎదుర్కొన్న విధానంలో ఇక్కడ ముఖ్యమైన భాగమేమంటే, ధర్మశాస్త్రమును బోధించుట ద్వారా పాపమును స్థిరీకరించుట. "నాకు పెనిమిటి లేడని నీవు చెప్పిన మాట సరియే, నీకు అయిదుగురు పెనిమిట్లుండిరి, ఇప్పుడు ఉన్నవాడు నీ పెనిమిటి కాడు...." దీనిని వినుటకు పాప స్వభావము కలిగిన శరీరము ఎంతో అసహ్యించుకోగలదు. ఇది తేలికగా ఆమెను అకస్మాత్తుగా మధనపర్చ గలదు. ఒకడు తప్పుచేస్తున్నపుడు అతనిని మనవైపునకు త్రిప్పుకొనుటకు ఇటువంటి అవకాశములు మనకు ఎన్నో వచ్చియుండవచ్చు. అయితే ఇది 'తీర్పు తీర్చుట' అని అతడు భావించినప్పుడు మనము వెనుకంజవేస్తాము. అయితే మనము వారిమీద ప్రేమతోనే వారిలో దాగియున్న పాపమును ఖండిస్తూ ఆపాపము అంగీకరించబడదని తెలియపర్చుచున్నాము. మనము ఎంతో పాపులమో మనకు తెలుసు కనుక ఒకరిమీద ఒకరు దయగలిగి, అవసరమైతే ధర్మశాస్త్రము ద్వారానైనా సరే ఆ పాపమును ఖండించుటకు వెనుకాడరాదు. ఈ సందర్భములో అతి ముఖ్యమైన విషయమేంటే, యేసు ఆమెతో ఒంటరిగా మాటలాడుచున్నాడు.

మత సంబంధమైన జ్ఞానము ఆమెకు ఎంత ఉన్నదో ప్రభువుకు తెలియపరచబడిన తరువాత ఆమెకు తెలిసిన ఆ జ్ఞానమును ప్రభువు సరిచేస్తు దానిని పెంచుటకు ప్రయత్నించుచున్నాడు. దయ మరియు కనికరముగలిగిన ఆత్మతో మనము కూడా అదేవిధముగా ప్రయత్నించాలి. తరువాత యేసు ఆమెతో అంత్యకాలములో జరుగు విషయములను మాటలాడుచున్నాడు. ప్రజలకు మనము అంత్యకాలములో ఏమిజరుగునో తెలియపర్చుటకు ఇష్టపడతాము. ఎందుకంటే ప్రజలు వారి చిన్న చిన్న జీవిత ప్రపంచాలలో అనేక సమస్యల ద్వారా చుట్టబడి ముందుచూపును కోల్పోతారు. ప్రభువు మాదిరిగానే మనము కూడా సంభాషణను నిత్య జీవమునుండి నిత్య మరణము వైపునకు జరుపుతాము. ప్రభువు ఆశించిన ఫలితంగానే "నీతో మాటలాడుచున్న నేనే ఆమెస్సీయాను" అను సువార్తకు ఆమె తన ఆసక్తిని ప్రదర్శించినది.


ఆయన పరలోక జాలరి కనుకనే ఆమెను "సరిచేసి గీత దాటించి" తన గాలముతో పట్టుకున్నాడు. మనము కూడా ఇటువంటి నిపుణతతో పనిచేయవలసి యున్నది. పరిశుద్ధ గ్రంధమును పూర్తిగా ధ్యానించు! ధ్యానించు! ధ్యానించు. అప్పుడు వాక్యమును సరిగా ఉచ్చరించుటకు ఉపయోగపడు జ్ఞానమును ఆ పరిశుద్ధాత్ముడు మనకు ఇవ్వగలడు.

## The Third Party

## మూడవ భాగస్వామి:- అపోస్తలుల కార్యములు 13:5-12

"ఆత్మీయ తాడు యుద్ధము" అని కూడా దీనిని అనవచ్చును. తాడుకు ఒకవైపు పౌలు, మరియొక వైపు ఎలుమ, మధ్యలో సెర్గిపౌలు. ఇది ఇద్దరి మధ్య జరగిన తీవ్రమైన వాదముతో కూడినది. అయితే సువార్త సాక్ష్యమును గూర్చినఈ తీవ్రమైన వాదము సెర్గిపౌలుతో కాదుగాని వ్యతిరేకి అయిన ఎలుమతోనే.

పౌలు దగ్గర దేవుని వాక్యమును వినుటకు ఎంతో శ్రద్ధగా ఉన్న సెర్గిపౌలును ఆటంక పరచుచున్న ఎలుమను పౌలు భక్తుడు ధర్మశాస్త్రముతో తీవ్రముగా ఖండించుచున్నాడు. ఇది మనకు లూథర్ భక్తుడు 'లైప్‌జిగ్' అను ప్రాంతములో తన వ్యతిరేకులతో జరిపిన తీవ్రమైన వాదమును మనకు గుర్తుకు తెస్తూఉన్నది. ఈ వాదములో లూథరు తన వ్యతిరేకులను వాదములో గెలుచుటకన్నా, ఆ వాదములో సాక్షులుగా పాల్గొన్నవారిని తన వాదనతో ప్రభావితం చేయుటకే ఎక్కువగ ప్రధాన్యత ఇచ్చినాడు.




సెర్గిపౌలు వివేకముకలిగిన వాడు కనుక అతడు నిజముగా పౌలు మరియు బర్నబాస్‌ల యొక్క వాక్యమందు ఎంతో ఆసక్తిని కనపరిచినాడు. అయితే ఎలుమ ఆ అధిపతిని విశ్వాసమునుండి దూరపరచుటకు ప్రయత్నించినాడు. ఈ దినాలలో ఈ విధముగా జరిగినట్లయిన పౌలు ఉపయోగించినట్లుగా మనము అపోస్తలుల శక్తిని ఉపయోగించలేక పోవచ్చు. అయితే ఇటువంటి ఆధునిక ఎలుమలను త్రోసివేయుటకు మరియు ఖండించుటకు ధర్మశాస్త్రము మనకు ఉన్నది. ఒక్కొక్కొసారి మనకు ముగ్గురు మరియు అంతకంటే ఎక్కువ ఉన్న గుంపులు మనకు ఎదురు కావచ్చు. అందులో దేవునియందు ఆసక్తి గలవారు ఎవరైన ఉండి మిగతావారి వలన వారి విశ్వాసము అణిచివేయబడుచున్నప్పుడు, అటువంటి వ్యతిరేకులవైపు మనము తిరిగి వారి విమర్శలను దేవుని వాక్యముచేత సరిదిద్దవలెను.

నేను కాలిఫోర్నియా కాలేజీలో ఉన్నప్పుడు ఇదేవిధముగా దేవునియందు ఆసక్తి ఉన్న ఒకరితో నేను మాట్లాడుచూఉండగా మోర్మన్ గ్రూపునకు చెందిన వ్యక్తి దీనిని ఆటంకపరచుచుండగా, అతని వాదము తప్పని నేను వాక్యముచేత గద్దించినాను. అదేవిధముగా ఇంకొకసారి నేను ఒక జంటకు వాక్యము అందించుచుండగా, యెహోవా సాక్షులు గ్రూపునుండి ఇద్దరు వచ్చి నన్ను ఆటంకరచినప్పుడు, నేను వారిని తీవ్రముగా వాక్యము ద్వారా ఖండించినాను. ఈ సంఘటన ద్వారా ఆ జంట దేవుని వాక్యము విని విశ్వసించినారు.

ఈ భాగములోని సౌందర్యమేమనగా, ఎలుమను పౌలు వాక్యముద్వారా ఖండించుటవలన సెర్గిపౌలు అనే అధికారి వాక్యమును విశ్వసించినాడు. అందువలనే "ఆ అధిపతి జరిగినదానిని చూచి ప్రభువు బోధకు ఆశ్చర్యపడి విశ్వసించెను" అని వ్రాయబడెను. పౌలు తన సువార్త బోధలో ఎలుమయొక్క ప్రమేయమును తొలగించిన తదుపరే సెర్గిపౌలును తన సువార్త ద్వారా గెలుచుకున్నాడు.


**కఠినత్వమును ప్రదర్శించువారు:-** లూకా 11:45-52 **The Manifestly Impenitent**

ఈ లోక పరిస్థితులను మనము పరిశీలించిన సువార్త ద్వారా ఎదుర్కొనుటకు సెర్గిపౌలులాంటి దేవుని వాక్యమును వినుటకై వెదకువారు అన్నివేళల మనకు దొరకరు. హేరోదు పాపమును బాప్తిస్మమిచ్చు యోహాను గద్దించినప్పుడు హేరోదు యోహానును ఏమి చేసినాడో మనకు తెలుసు. అయినాసరే మనము ఆ విధముగా పాపమును గద్దించక తప్పదు. "కాబట్టి ఈ నీ చెడుతనమును మానుకొని మారుమనస్సునొంది ప్రభువును వేడుకొనుము; ఒకవేళ నీ హృదయాలోచన క్షమింపబడవచ్చును" (అపోస్తలుల కార్యములు 8:22) అని పేతురు గారడీ సీమోనును గద్దించిన రీతిగా మన గురి కూడా అదేవిధముగా ఉండవలెను.

లూకా 11వ అధ్యాయములో మనము గమనించేదేమంటే, మార్కు సువార్త 12వ అధ్యాయములో ఉన్న వ్యక్తి యొక్క ఉద్దేశ్యమువలె ఇక్కడ లూకా 11వ అధ్యాయములో ఉన్న వ్యక్తియొక్క ఉద్దేశ్యములేదు. కఠినులైనవారు మనయొక్క సువార్త మాటలను భరించలేక మరల మరల అదే పనిగా వాదించుదురు. తన వారి యొక్క నీతి సూత్రాలను ఆ ధర్మశాస్త్రోపదేశకుడు కాపాడగలుగును కాని వారి వేషధారణను కాపాడునా? అయితే మానవ హృదయమును చదువగలిగిన యేసు అతడు అమాయకుడు కాడని తెలుసుకొనగలడు. ప్రభువుకున్న అటువంటి శక్తి సామర్థ్యాలు మనకు లేవు కనుక ఆ వ్యక్తి పలికిన మాటలను బట్టి మరియు చేతలను బట్టి మనము తీర్పు చెప్పవలసియున్నది. కావాలని కఠినులుగా ఉన్నవారి యెడల ప్రభువు ఇక్కడ ఉపయోగించిన రీతిగా మనము కూడా ధర్మశాస్త్రమును ఉపయోగించి మాటలాడవలెను. ఒకసారి వైన్‌కెన్ అను లూథరన్ మిషనరీ గుర్రము మీద ప్రయాణిస్తూ దారిలో తన తోటి ప్రయాణీకునికి ఇదే విధముగా సువార్తను ప్రకటిస్తూ ఉన్నాడు. అయితే ఆ ప్రయాణీకుడు చాలా కఠినముగా ఉండి ప్రతిదానికి కూడా ఎదురు మాట్లాడుచూ విమర్శిస్తూ ఉన్నప్పుడు ఆ మిషనరీ కోపముతో 'అయితే నీవు నరకానికే వెళ్ళు' అని గట్టిగా గద్దించి చెప్పినప్పుడు వైన్‌కెన్‌యొక్క కఠినమైన మాటల ఫలితముగా ఆ ప్రయాణీకుడు పశ్చాత్తాపపడి సువార్తను అంగీకరించినాడు.

అదే మనయొక్క గురియై యున్నది. ఈ సందర్భములో ప్రభువు యొక్క మాటలు ఆ ధర్మశాస్త్రోపదేశకుని పడగొట్టి గోడకు గుచ్చివేసినవి. "మీరు మోయశక్యముకాని బరువులను మనుష్యులమీద మోపుదురుగాని మీరు ఒక వ్రేలితోనైనను ఆ బరువులను ముట్టరు. ఒక మనుష్యుని పాపమును అతనికి వివరముగా తెలియపరచుటకు ఎంత సమయము మనకు పట్టునో తెలిసే అవకాశము మనకు లేదు. సరికాని మరియు రెండువిధాలైన వారియొక్క దంద్వ పవృత్తిని ఇక్కడ ప్రభువు తెలియజేస్తూ ఉన్నాడు.

"హేబేలు రక్తము మొదలుకొని బలిపీఠమునకును మందిరమునకును మధ్యను నశించిన జెకర్యా రక్తము వరకును చిందింపబడిన ప్రవక్తలందరి రక్తము....." లేఖనములతో తనకున్న పరిపూర్ణమైన అనుబంధము ద్వారా ప్రభువు ఇక్కడ మాట్లాడు చున్నాడు. ఇదే విధముగా సందర్భాన్నిబట్టి సరైన లేఖనాన్ని ఉపయోగించి మాట్లాడుటకు మనము ప్రభువుమాదిరిగా అంత సంపూర్ణులము కాము.



ఈ వృత్తాంతము చివరలో ప్రభువు, ఇతరులను అడ్డగించుచూ ఉన్న అతని తప్పును అతని మీద మోపుచున్నాడు. ఏ మనుష్యుడు కూడా ఒంటరి దీవిలాంటివాడు కాడు. ప్రతి ఒక్కరు ఇతరులను ఏదో ఒక విధముగా ప్రభావితం చేయగలరు. అదేవిధముగా ఇక్కడ గౌరవనీయుడైన ధర్మశాస్త్రోపదేశకుడు కూడా ఇతరులను తన పద్ధతిలో ప్రభావితం చేయుచున్నాడు. "మీరు లోపల ప్రవేశింపరు, ప్రవేశించువారిని అడ్డగింతురు." ఇతరులను ప్రభావితము చేయగల తమయొక్క సామర్ధ్యతను గురించి వారు గర్వముతో ఉన్నప్పుడు అతనిని సువార్తతో ఎదుర్కొనే ఈ సందర్భానికి తగినట్లుగా ఉన్న పరిస్థితిని మనము గమనించి ఆ అవకాశమును మనము చక్కగా ఉపయోగించుకొనవలెను.

అన్నిటికంటే ప్రాముఖ్యముగా మనము గమనించవలసినదేమంటే సువార్తను వినుటకు కఠినత్వమును చూపువారికి మనము ధర్మశాస్త్రము ద్వారా మాత్రమే వారిని ఎదుర్కొని మాట్లాడవలసియున్నది. ఎందుకనగా కృపతో కూడిన సువార్తలోని విషయాలను అంగీకరించుటకు వారు సిద్ధపడరు కనుక. అటువంటి వారియెడల మనయొక్క సువార్త సాక్ష్యము పందులమంద ముందు వేసిన ముత్యములను పోలియుండగలదు. వారికి సువార్తయొక్క విలువ తెలియక దానిని త్రోసివేస్తూ, దానిని అనవసరముగా విమర్శించుదురు కనుక అటువంటి వారికి ధర్మశాస్త్రమే సరైన మార్గము.

**Looking in all the Wrong Places**

**అన్ని చెడ్డ స్థలములలో చూచుట (మత్తయి 19:16-24)**:-

తత్వశాస్త్రం ద్వారాను, వారి స్వంత అభిప్రాయాల ద్వారాను మరియు ఊహల ద్వారాను జీవిత సమస్యలకు సమాధానాలను వెదకేవారు మనకు నిత్యజీవితంలో అప్పుడప్పుడు తటస్థపడుతుంటారు. ఈ రీతిగా మానవ మేధస్సులో ఉధ్భవించే అనేక ఆలోచనలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ ఉంటారనేది వాస్తవం.


ఈ విధంగా తమను తామే పరిశుద్ధులుగాను సరియైనవారిగాను నిర్ణయించుకొనేవారు, ప్రభువుదినాలలోగాని, ఈ దినాలలోగాని తాము చేసేటువంటి మంచి పనుల ద్వారా దేవుని వేడుకొంటూ ఉంటారు. ఈ జీవితం తరువాత కలుగు బహుమానం కొరకు వారు ప్రభువు ఇచ్చిన పది ఆజ్ఞలను ఈ విధంగా వాడుకొంటారు. పైన చెప్పబడిన వాక్యభాగంలోని మిగుల ఆస్తి గలిగిన యౌవనస్తుడు ఇదేవిధమైన భావములతో ప్రభువును సమీపిస్తూ ఉన్నాడు. "బోధకుడా నిత్యజీవము పొందుటకు నేను ఏ మంచి కార్యము చేయవలెను?"

ఇది మనకు మాత్రము చాలా విచారకరమైన విషయం. కాని కీర్తి ప్రతిష్టలు కలిగిన అనేక నివాసుల పోకడ ఇదే. వాస్తవాతీతంగా పోవుటనేది ప్రభువు కాలంలో ఉన్న యూదులకు మామూలే. ఈనాడు కనబడుచున్నటువంటి గొప్ప అంత్య క్రీస్తు సంఘమునకు ఈ 'స్వంత కార్యాల మతమే' గొప్ప పునాదిగా ఉన్నది. ఈనాడు మన మధ్యనున్న అనేక ప్రొటెస్టెంట్ డినామినేషన్లలో కూడా సముద్ర తీరాన గొప్ప యుద్ధానికి సిద్ధమన్న మాదిరిగా ఈ రకమైన పోకడ ఉన్నది.

ఇక్కడ ఉన్న యౌవనస్తునితో ప్రభువు చాలా సౌమ్యంగా మాట్లాడుచూ ఉన్నాడు. ఇక్కడ ఆ యౌవనస్తుడు క్రీస్తును చిక్కులో పెట్టాలనిగాని, లేదా క్రీస్తుకు పరీక్ష పెట్టాలనిగాని అనుకొనుట లేదుగాని, తన ప్రశ్నకు సమాధానం క్రీస్తునుండి రాబట్టాలని మాత్రమే చూస్తున్నాడు. ఆజ్ఞలను గైకొనుమని ప్రభువు ఆ యౌవన అధికారికి సూచించగా అతడు అవన్నియూ అనుసరించుచున్నానని పలికెను. అతడు వాటిని అనుసరించుట లేదని ప్రభువు హెచ్చరించుటలేదుగాని, నిత్యజీవమనేది అతనికి అసలు నిజముగా కావలెనా లేదా అనే విషయమునకు ప్రభువు వస్తున్నాడు. "నీవు పరిపూర్ణుడవగుటకు కోరినయెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుము" అని అతనితో చెప్పెను. గమనించారా! ఎక్కడ నీధనముండునో అక్కడే నీ హృదయము కూడా ఉండును. అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాట విని వ్యసనపడుచు వెళ్లిపోయెను. ఈనాడు సమాజములో ఉన్న ఈ అంతులేని భోగభాగ్యములు మనకు ఆశీర్వాదమే కాకుండా శాప కారణం కూడా. క్రైస్తవులమైన మనము ప్రభువు పనికి మరింత ఎక్కువగా ఇవ్వవలసియున్నది. ఈనాడు మన సమాజంలో మనకున్నటువంటి ఈ సాంకేతిక నైపుణ్యాన్నికూడా ప్రభువు ఉద్దేశ్యాల కొరకు చక్కగా వాడకొనవచ్చును. కాని ఈనాడు అనేకమందికి ఈ ధనమనేది ఒక ఎరగా మారినది. ఆ గాలపు ముల్లుకు చిక్కుకొని అనేకమంది మునిగిపోవుచూ ఉన్నారు. పరముకన్నా ధనమే సర్వమనే ఇటువంటి వారితో మనము దేవుని వాక్యము ద్వారా మాట్లాడవలసియున్నది.

ఆ రీతిగా మాట్లాడునప్పుడు ధనము పరము మధ్యనున్న వ్యత్యాసమును చక్కగా ఈ క్రింది విధముగా వివరించవలసియున్నది. క్రీస్తు మన జీవితములను ఏలవలెనా లేక సాతాను భయంకర పరిమాణాలతో మన జీవితములను శాసించవలెనా. నిత్యజీవితమా లేక నిత్యమరణమా. పైనుండి పాపక్షమాపణయా లేక మనుష్యుల వలన పుణ్యకార్యాలా. క్రీస్తును మరియు సిరిని కూడా కలగలిపి సేవించే ఆలోచనకు అవకాశమిచ్చేలా ఎప్పుడు మనము మన మాటలను ఉపయోగించరాదు. ఒకవేళ మన ప్రయాస వృధా అయినప్పుడు కూడా నిరాశచెందరాదు. మార్పు అనునది కేవలము దేవుని శక్తి వలన జరుగుననేది మనము గుర్తించవలెను.

ఒక అడుగుతో నీవు ఎంతో దూరము వెళ్ళలేవు; నీవు నిరంతరము ముందుకు అడుగులు వేస్తూనే ఉండాలి.
ఒక మాటతో నీవు ఎవరో ప్రజలకు తెలుపలేవు; నీవు నిరంతరము మాట్లాడుచునే యుండాలి.
ఒక అంగుళము నిన్ను ఎంతో ఎత్తుగా ఉంచలేదు; నీవు నిరంతరము ఎదుగుచునే యుండాలి
ఒక పిలుపు అంతా చేయలేదు; నీవు నిరంతరము వెళ్లి పిలుస్తూనే యుండాలి.




మనకున్న వాక్యాధార మాటల ద్వారా వారికి ఏది ముఖ్యమో ఎంచుకొనే అవకాశమును ఇవ్వవలెను. వెంటనే నిర్ణయము తీసుకొనలేక పోవచ్చును. కాని అతనికి ఒక అవకాశము ఇవ్వవలెను కదా! వారి నిర్ణయాధికారమును మార్చుకొనుటకు మనము కొంత సమయాన్ని ఇవ్వాలి కాని అప్పుడే క్రీస్తా లేక ధనమా అని నిర్ణయించమనకూడదు. ధనవంతమైన జీవితమును గురించి పరిశుద్ధ గ్రంథములో అనేకమైన హెచ్చరికలు మనకు ఉన్నాయి. ధనమున్న చోట హృదయముండకూడదని..., ఒంటె సూది బెజ్జములో ప్రవేశించుట..., శోధనలో పడుట...., ఉరివలే మీదికి ఒక దినము వచ్చుట....

'నేను ఏ మంచి కార్యము చేయవలెను?' యవనస్తుడు అడిగిన ఇటువంటి స్వనీతి కార్యములను గురించిన ప్రశ్నకు సమాధానమును వివరించుటకు పరిశుద్ధ గ్రంథములో చాలా వాక్యభాగములన్నవి. 'మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు.' ఎఫెస్సి 2:8-9, 'మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డలవలెనాయెను.....(యెషయా 64:6), ...మేలుచేయు వాడొకడును లేడు......(కీర్తన 14:1,3), ధర్మ శాస్త్రకార్యముల మూలమున ఎవడునూ రక్షింపబడనేరడు.....ఆ యవనస్తుడు తన ఆస్తిని బీదలకు ఇచ్చి బోధకుని అనుసరించుటకు ఇష్టపడుటలేదు గనుక అతని స్వనీతి పరిపూర్ణమైనది కాదని ప్రభువు అతనికి తెలియజేయుటకు ఆశించినాడు.

**తప్పుడు నమ్మకములు (యోహాను 3:1-21)**:- **Wrong Loyalties**

పైభాగములోని యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక వ్యసనపడుచు వెళ్ళిపోయిన తరువాత ఇక అతని జీవితపు చివరి ఫలితము ఏమిటో మనకు తెలియదు. అయితే ఈ భాగములో ఉన్న నీకొదేము యొక్క జీవిత చివరి ఫలితము ఏమిటో మనకు స్పష్టముగా తెలుసును. నీకొదేము కూడ మొదట ప్రభువు చెప్పినది విని ఆయనను అనుసరింపకుండా వెడలిపోయినాడు. కాని తరువాత ప్రభువు సమాధి కార్యక్రమములో అతని యొక్క విశ్వాసము ఏరీతిగా అతనిలో పని చేసినదో మనము చూడగలము. మన సువార్త పరిచర్యలో మొదటిగా మనము అనుకున్నంతగా ఫలితములను సాధించలేకపోయినా నిరుత్సాహ పడకూడదు. కాని సమయము గడచు కొలది మన చూపునకు అందకుండా ప్రభువు దానిని ఫలింపచేయగలడు. ఈ నీకొదేము సంఘటన మనకు మంచి ప్రోత్సాహకరము.




నీకొదేము యూదుల యొక్క వేషధారణతోను స్వనీతి కార్యములతోను పెంచబడినవాడు. ఈ భాగములో నీకొదేము ప్రభువును సంపూర్ణముగా అర్థము చేసుకోని రీతిలో మనకు కనిపించును. అయితే ప్రభువు అతని హృదయములో నాటిన వాక్యపు విత్తనములను తరువాత కాలములో పరిశుద్ధాత్మ దేవుడు చక్కగా మొలిపింపచేసి ఎదగనిచ్చెను ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను మరల క్రొత్తగా జన్మింపవలెనని చెప్పినప్పుడు ఇది ఏలాగు సాధ్యమని ప్రశ్నించుచున్నాడు. పాత జీవితముతో సంబంధము తెంచుకొనవలసిన అవసరతను అతడు ఈ దశలో గుర్తింపలేకపోయినాడు.

మోషే అరణ్యములో ఎత్తిన ఇత్తడి సర్పము క్రీస్తు బలికి ముంగుర్తుగా ఎలా ఉన్నదో ప్రభువు ఇక్కడ వివరిస్తున్నాడు. విమోచకుడికి సాదృశ్యములుగా ఉన్న అనేక పాతనిబంధన దృశ్యములలో ఇది ఒకటి. యూదా మత ప్రవిష్టుడైన నీకొదేమునకు ఈ దృశ్యము చాలా బాగా పరిచయమైనదే. అందువలననే అతని మనస్సులో ఈ దృశ్యము స్పష్టముగా ముద్రింపబడినది. క్రీస్తు చెప్పిన లేక చేసిన కార్యములు ఏరీతిగా లేఖనములను నెరవేర్చినవో క్రొత్తనిబంధనలో చక్కగా మరల మరల వ్రాయబడినవి. నీకొదేము వలే కాకుండా, దేవుని వాక్యభాగములతో సరిగా పరిచయములేని వ్యక్తితో మనము వాక్యమును గురించి సాక్ష్యము చెప్పునప్పుడు, క్రీస్తు ఏరీతిగా ప్రవచనములను

నెరవేర్చుటకొరకు మెస్సీయాగాను మరియు లోకరక్షకుడుగాను అవతరించాడో మనము బైబిల్ ప్రవచనాలను ఉపయోగించి చక్కగా వివరించవచ్చును. వాగ్దానము చేసినవాడు దేవుడు గనుక వాటి నెరవేర్చువాడుకూడా ఆయనే.

లోకమునకు వెలుగైన కుమారుని త్రోసివేయువారిలో చేరవద్దనిఇక్కడ ప్రభువు నీకొదేమునకు ఒక హెచ్చరిక ఇస్తూఉన్నాడు. ఈ సందర్భములోనే పరిశుద్ధ గ్రంథములో అత్యంత ముఖ్యమైన వాక్యభాగమును ఇక్కడ మనము గమనించగలము (యోహాను 3:16). తనను పరీక్ష పెట్టుటకును మరియు ప్రశ్నలతో చిక్కులలో పెట్టుటకు వచ్చువారివలె కాక అసక్తితో తన యొద్దకు విచారణకొరకు వచ్చిన నీకొదేమును ప్రభువు గమనించి చక్కగా సువార్తను అందించుచున్నాడు. మన యొద్దకు వచ్చువారిని మనము కూడా ఇదే విధముగా బాగుగా గమనించి సువార్తను అందించవలెను. దీనివలన వారు మన యొద్దనుండి సువార్తసాక్ష్యమును ఏవిధముగా అందుకొనగలరో మనము చక్కగా తెలుసుకొనగలము. ఎవరైతే మనలను మనస్ఫూర్తిగా ప్రశ్నించగలరో వారికి సువార్త చక్కగా అందేలా మనము చేయగలగాలి.

తప్పుడు సిద్ధాంతములపై లేదా తప్పుడు మనుష్యులపై నమ్మకము గలిగిన అనేకులను మనము చూస్తుంటాము. నీకొదేము కూడా యూదా సిద్ధాంతములపై మరియు సన్‌హెడ్రిన్ సభయందు నమ్మకము కలిగినవాడు. అపో.కా 24:22 తదుపరి వచనములలో పౌలు, రోమా ప్రభుత్వముపైన, అధికారముపైనా మరియు డబ్బుపైనా గొప్ప నమ్మకము కలిగిన ఫేలిక్సు అనునతనికి తన సువార్త సాక్ష్యమును చెప్పుటకు ఎంతో ప్రయత్నించెను. అదే విధముగా అపో.కా 26:1 తదుపరి వచనములలో తన అధికారముపైనా మరియు తనను రాజు చేసుకొనిన యూదులపై ఎంతో నమ్మకము కలిగి ఉన్న అగ్రిప్పరాజుతో పౌలు యేసు యొక్క సత్యాలను గురించి మరియు పాప క్షమాపణను గురించి ఏంతో గొప్పగా వివరించి అతనిని మార్చుటకు ప్రయత్నించెను. అదే విధముగా మనము కూడా అనేకులకు వివరించుటకు ప్రయత్నించవలసి యున్నది. క్రీస్తా లేక ఇతరులా లేకా ఇంకదేనినైనా నమ్ముకొనుటయా? దీనిని మనము స్పష్టముగా వివరించవలసియున్నది.



**ముగింపు:-** **Conclusion**

ఇటువంటి మంచి ఆత్మీయ పద్ధతుల ఉదాహరణల ద్వారా మనము ప్రభువును గూర్చి ఇతరులకు సాక్ష్యమిచ్చుటలో ఇంకా ఎంతో నేర్చుకొనవలసియున్నది. అయినా మనము నేర్చుకొనవలసిన బహిరంగ సత్యము

ఒకటి యున్నది. ఆది అపోస్తలులవలే మనము మాట్లాడలేకపోవచ్చు. సరైన సమయాల్లో మనము జన్మించి మనము దేవునికి గొప్పగా ఉపయోగపడలేదని మన మనస్సాక్షి మనలను బాధించవచ్చు. కాని సేవాభారము యొక్క అవసరత మన మీద ఉంచబడినది. మనకున్న ఇతర భారమైన అవసరతలకన్నా ఈ సేవాభారము యొక్క అవసరత అంత ప్రాముఖ్యమైనదిగా మనకు కనిపించకపోవచ్చు. కాని మనము గుర్తుంచుకొనవలసిన సత్యము ఒకటున్నది. మనము ఆయనను ప్రేమించకముందే అయన మనలను మొదటిగా ప్రేమించి మనకొరకు భయంకరముగా శ్రమపడి చనిపోయాడు. అందువలన మన పనులకన్నా అయన గురించి మనము మాట్లాడవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. అదే మన అంతరంగ బాధ్యతయైయున్నది.

కాబట్టి మనము ఇతరులను సువార్తలు మరియు అపోస్తలుల కార్యముల ద్వారా ఎదుర్కొని సాక్ష్యముచెప్పి వారికి వివరించునప్పుడు ఏమాత్రము కూడా విసుగు చెందరాదు. మనము దేవుని సువార్తను వాస్తవానికి ఇంకా ఎంత ఎక్కువగా ఎదుటివారికి వివరించవలసిన అవసరత ఏమిటి? ఈ క్రింది విషయములను గమనించుము.

ఇప్పటి వరకు మనము ఈ అంశములో మనము చెప్పుకున్న సంగతులు క్లుప్తముగా మరియొకసారి గమనిద్దాం.

నిన్ను ప్రేమించువారిని మరియు నీవు ప్రేమించివారిని నిజముగా నీవు దేవుని వాక్యము ద్వారా చేరుకొనవలసియున్నది.

ఇతరులకొరకు నిన్ను నీవు సావధాన పరచుకొనుటలో ఆసక్తి ప్రదర్శించుము.

పరిస్థితులకు అనుకూలముగా ఉండి నీగురించి ఏమి దాచక పారదర్శకతను ప్రదర్శించవలసియున్నది.

ఎదుటివారి మనస్సులలో ప్రభువుగురించి ఆలోచన రేకెత్తేలా నీవు వారికి స్వచ్ఛమైన సాక్ష్యమును చెప్పవలసి యున్నది.

దేవుని వాక్యమును శ్రద్ధగా ధ్యానించి మంచి ఉదాహరణలను ఎన్నుకొని మంచి మంచి విషయములను నీవు చెప్పు సాక్ష్యమునకు జోడించవలెను.

నీవు చెప్పిన వాక్యము ద్వారా నీకును ఇతరులకును ఒక ఉమ్మడి పీఠాన్ని ఏర్పరుచుకొని, వారిలో వినగలిగిన చెవిని ఏర్పరచి వారితో చక్కటి సంబంధాన్ని కలిగియుండాలి.

ఇతరులలో ఎటువంటి సందేహాలకు తావులేకుండా నీ వాక్యసాక్ష్యమును సాధ్యమైనంత వరకు ముగించవలసియున్నది.

ఇతరుల వేషధారణను నీవు ఖడించునప్పుడు నీవు వేషధారిగా ఉండవద్దు.

ఎదుటివారిపైన ఉన్న నీ ప్రేమను చక్కటి మాటలద్వారా ప్రదర్శించుము, అవసరమైతే చేతలద్వారా కూడా ప్రదర్శించవలసియున్నది.

సాధారణమైన సంభాషణద్వారా ఆరంభించి ఆత్మీయ సంభాషణలోనికి మారునట్లు జాగ్రత్త వహించవలెను.

పాపమును గూర్చి మాట్లాడునప్పుడు ధర్మశాస్త్రము ద్వారా అధికారపూర్వకముగా చెప్పవలెను మరియు రక్షణను గూర్చి మాట్లాడునప్పుడు సువార్త ద్వారా నచ్చజెప్పవలెను.

ముఖ్యమైన వాక్యంశముల జ్ఞానముపైన ప్రసంగ సాక్ష్యములు కట్టవలెను.

కఠినమైనటువంటి వారిని ధర్మశాస్త్రముయొుక్క ముల్లులతోనే వదిలివేయండి.

క్రీస్తుకు మరియు సిరికి ఉన్న తేడాలను స్పష్టంగా చెప్పడంలో జాగ్రత్త పడండి.

వాక్యము ద్వారా ఆత్మ ఎదుటివారిలో పనిచేయువరకు ఓపిక వహించండి.

ఎదుటివారిని మనము ఖచ్చితమైన వాక్యము ద్వారా ఎదుర్కొనుటకు ముందు మరియు తరువాత ప్రార్థన చేయండి.

మనకున్నది ఒకే జీవితమే, అది కూడా త్వరగా జరిగి పోయేదే. క్రీస్తు కొరకు జరిగించిన పని మాత్రమే మిగులును. క్రీస్తు కొరకు సేవ చేయుటకు దేవుడు నీకు శక్తిని దయ చేయును గాక.

రెవ. డేవిడ్ కీని.
(Rev. David Koenig)

